# తీర్పు

రేణుక అయోల

ఏమిటో ఈ రోజుల్లో ఇంట్లో పెద్దవాళ్లు మాట అంటే లెక్క లేకుండా పోతోంది...

"అమ్మాయి వసంతా! మడి బట్ట ఆరవేశావా లేదా? ఇంట్లో పెద్దదాన్ని ఒక్కర్తినే ఇంటి ఇంటెడు చాకిరి చేస్తున్నానన్న ఇంగితం ఉందా లేదా?" అంటూ పెద్ద పెద్ద కేకలు పెడుతున్న అత్తగారు, ఇదేమీ పట్టనట్లు మంచం మీద పడి దొర్లుతున్న భర్తని చూసి నిట్టూర్చింది వసంత.

ఇవాళైనా ఆఫీసుకి వెళతాడో లేదో తెలియదు. అసలు వారంలో రెండు రోజులు కచ్చితంగా ఆఫీసుకి వెళ్లడు. ఎందుకు వెళ్లడో కూడా అర్థం కాదు, చెప్పడు కూడా...

"మీ మడి చీర రాత్రే ఆరవేశాను, పొద్దున్నే స్నానం చేసి దాన్ని తీసి పూజామందిరం గట్టు మీద పెట్టాను, చూడండి" అంది వసంత వంటింటి గుమ్మం ముందు నిలబడి.

"ఆ గట్టు మీద పెట్టావా? నాకెలా తెలుస్తుందీ, రోజుకో చోట పెడతావు, అయినా ఈ అడ్డమైన చాకిరీ చేయలేక ఛస్తున్నాను, నీకేం చక్కగా 'టింగు రంగా' అంటూ తయారై ఆఫీసుకి వెళతావు" అంటూ గొణుక్కుంటూ పొద్దున్నే వంట చేస్తూ, రకరకాల శాపనార్థాలతో ఉడికీ ఉడక్కుండా ఇంత వండి పక్కనపడేసి ఆయాసపడి పోతుంది వసంత అత్తగారు, సుందరమ్మ.

"అయినా ఇంత కష్టపడ్డం ఎందుకు, మీ అబ్బాయిది గవర్నమెంట్ ఉద్యోగం కదా నేను ఉద్యోగం మానేసి ఇంట్లో కూర్చుంటాను" అంటే చాలు...

"ఏం తల్లీ ఏదో పెద్దదాన్ని వండలేక పోతూ చిన్నమాట అంటాననుకో, దాన్ని పట్టుకుని ఇంత రాద్ధాంతసిద్ధాంతం చెయ్యాలా? ఏదో తల్లి లాంటిది విసుక్కుంది అనుకోవాలి, చూశావురా రంగా!" అంటూ దీర్ఘాలు తీస్తూ, ఆమాటనే పదే పదే సాగదీస్తూ, ఓ వారం రోజులు ఆ మాట ఎందుకన్నానురా భగవంతుడా అనేటట్టు చేస్తుంది...

"వంట అయిందా అత్తయ్యా, ఆఫీసుకి కొద్దిగా లేటు అయినా గేట్లు మూసేస్తాడు" భయం భయంగా నెమ్మదిగా అడిగింది వసంత...


"అయింది తల్లీ! ఇలా అందరికీ చాకిరీ చెయ్యమని భగవంతుడు నా నుదుటి మీద రాశాడు, రా వడ్డిస్తాను! ఇంద టిఫిను డబ్బా" అంటూ ముందుకు తోసింది విసురుగా.

స్టీలు డబ్బా మూత విడిపోతుందన్న భయంతో వంగి డబ్బా పట్టుకుని తీసుకుంది.

అన్నం తిని మిగిలిన అంట్లు అన్నీ కడిగి బోర్లించి, "వస్తానత్తయ్యా" అంటూ మరోసారి గూట్లో వున్న చిన్న అద్దంలో ముఖం చూసుకుంటూ, బొట్టు, జడ సరిదిద్దుకుంటూ, "చూసుకున్నాది చాల్లే ఇంక వెళ్లు..." అన్న భర్త మాటలకి ఉలిక్కిపడి చూసింది.

గళ్ల గళ్ల పొడుగాటి లాగు వేసుకుని, నోటి నిండా నురగతో బ్రష్ చేతిలో పట్టుకుని నిలబడ్డాడు. అలా నోట్లో నుంచి తెల్లటి నురగతో ఎవరైనా మాట్లాడితే చాలా అసహ్యం వేస్తుంది. గిరుక్కున ముఖం తిప్పుకుని, చెప్పులు వేసుకుని బయలుదేరింది.

టైము చూసుకుంటే తొమ్మిది అయింది. ఆ రూటు బస్సు వెళ్లిపోతే మళ్లీ అరగంటకి గాని రాదు. గబగబ పరుగులాంటి నడకతో బస్‌స్టాండ్ చేరుకుంది. అదృష్టం బాగుంది. బస్సు అప్పుడే వచ్చింది, సీటులో కూర్చుంటుంటే కండక్టర్ పలకరింపుగా నవ్వాడు. రోజూ అదే బస్సులో ఎక్కుతుంది కాబట్టి బస్ పాస్ చూస్తూ.



కిటికీలో నుంచి చల్లగాలి వస్తోంది, కొద్దిగా అలసట తగ్గినట్లు అనిపించింది. పొద్దస్తమానం ఈ చిన్న కంపెనీలో పని, ఇంటికి వెళ్లగానే ఏదో ఒక దానికి సాధించే అత్తగారు. పెళ్లయి ఏడాది కావస్తున్నా రంగారావు పద్ధతి ఇప్పటికీ అర్థం కాదు.

రైల్వేలో ఉద్యోగం చేస్తున్నాడని, పెళ్లిచూపులు చూసిన వెంటనే మీ అమ్మాయి నచ్చిందంటూ కబురు పెడితే అమ్మా, నాన్నా పొంగిపోయారు. ఇంటర్ పూర్తి చేసి ఇంకా పైచదువులు చదవాలని ఉన్నా, ఇంట్లో పరిస్థితి బట్టి, ఇంటికి కొద్ది దూరంలో ఉన్న ఈ మందుల కంపెనీలో చేరిపోయింది. నెలకి రూ. 2,000/- జీతం. అందరూ ఆడవాళ్లే, ఒక్క మేనేజర్ శివానందం; ప్యూను నాగేశ్ తప్ప. ఉద్యోగంలో చేరిన ఆరు నెలలకు పెళ్లి సంబంధం కుదిరింది. తల్లీతండ్రుల మీద భారం పడకుండా తన జీతంతో కనీసం తన పెళ్లి ఖర్చులైనా పెట్టుకుందామనుకుంది. ఆ అవకాశమే లేకుండా పోయింది.

పెళ్లిలో చిన్న చిన్న విషయాలకే పేచీ పెట్టినప్పుడే చాలా భయం వేసింది వసంతకి, అయినా సర్దుకుంది. మగపెళ్లివారు కదా ఆ మాత్రం బెట్టు చేస్తారనీ. కానీ పెళ్లికొడుకు రంగారావు ప్రవర్తన ఇంకా ఆశ్చర్యంఅనిపించింది అందరికీ. ముఖంలో ఓ సంతోషం కానీ, నవ్వు గాని ఏమీ లేవు. ఏదో రాయిలా బిగుసుకుపోయి, ఒక్క వాళ్ల అమ్మతోనే మాట్లాడుతూ, పెళ్లికూతురి వైపు కొద్దిగా కూడా ఆసక్తిగా చూడలేదు.

ఆ తరువాత చాలా సార్లు అనుకుంది వసంత, తనని పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని.

కానీ అత్తవారింటికి వెళ్లాక అర్థం అయింది, ఆ మనిషి తత్వం. చాలా వింత మనిషి. ఎంత సేపూ అమ్మ కొంగు పట్టుకు తిరుగుతూ అమ్మ ఏది చెబితే అదే వేదం.

ఉద్యోగంలోకి నాలుగు రోజులు వెళితే పది రోజులు మానేస్తాడు. పోనీ ఇంట్లో ఉండి ఏదైనా పని చేస్తాడా అంటే అదీ ఉండదు. పొద్దస్తమానం ఊరికే అలా కాలక్షేపం చెయ్యడం, ఆఫీసులో పని చేసేవాళ్లు అందరినీ పేరుపేరునా తిట్టడం. దానికి వంత పాడుతూ వాళ్లెవరో తెలియకపోయినా, ఆవిడా కొడుకుతో పాటూ తిట్టడం.. అది వాళ్లిద్దరి దినచర్య. ఇంక ఇరుగుపొరుగు వాళ్లంటే మహా మంట.

"అమ్మా చూశావా! దానికెంత పొగరో, చూడు ఎలా సింగారించుకుని తిరుగుతుందో! మన పక్క ఇంట్లో ఉంటుందే ఆ వనజ, దానికి అసలు అణుకువ ఉందా? ఎలా అలంకరించుకుంటుందో చూశావా?"

ఇలాంటి పనికిమాలిన కబుర్లు చెప్పుకోవ

డానికి వీధి గుమ్మంలో ఓ కుర్చీ వేసుకుని, వచ్చిపోయేవాళ్లని వెక్కిరిస్తూ ఉంటే, కొడుకుని మందలించాల్సింది పోయి, ఆవిడ కూడా కూర్చుంటుంది. పేరుకే ఆ పూజ పుస్తకాలు, కొడుకుతో సమానంగా వీధిలో వచ్చిపోయేవాళ్లని విమర్శిస్తూ, ఎవరైనా గమనిస్తున్నారని తెలియగానే,పూజ పుస్తకంలో నుంచి ఏదో ఓ పద్యం అందుకుని గట్టిగట్టిగా చదివేస్తుంటుంది.

ఇంట్లో ఆ గోల అయితే, ఆఫీసులో మేనేజర్ శివానందంతో ఇంకో తంటా, ఆఫీసులో చేరినప్పుడు వేరే బ్రాంచ్‌లో ఉండేవాడట. పెళ్లి అవగానే ఈ బ్రాంచ్‌కి వచ్చినట్లున్నాడు. ''వచ్చీరాగానే అమాయకంగా, అందంగా ఒద్దికగా ఉండే వసంత అంటూ తెగ మోజు పడిపోయాడు. ''వసంతా, నువ్వు నిజంగా వసంతానివే, ఈ ఆఫీసుకి'' అంటూ రోజు ఏదో ఒక కారణంతో చేతులు పట్టుకుని నలిపేస్తుంటాడు.

మిగిలిన ఆడవాళ్లంతా చూసీచూడనట్లు తప్పుకు తిరుగుతారు. అందరికీ తెలుసు అతను మంచివాడు కాదని. అయినా ఎదురు తిరిగి తమ ఉద్యోగాలకే ముప్పు తెచ్చుకునే ధైర్యం ఎవరికీ లేదు. ఆ వచ్చే రూ. 2,000/- చాలా అవసరాలు తీరుస్తాయి. అయితే అతనంటే అందరికీ కడుపు మంటా, సమయం దొరికితే చాలు అతన్ని తిట్టుకోని క్షణం అంటూ వుండదు.

తను దిగవలసిన స్టాపు రాగానే గబగబ దిగింది వసంత, ఆలోచనలో నుంచి తేరుకుంటూ.

లేటు అవలేదు కదా, కొంచెం లేటు అయినా గేటు మూసేస్తాడు. అప్పుడే గేటు మూస్తున్న సాంబయ్య వసంతను చూసి గేటు తెరుస్తూ, ''మళ్లీ ఆలస్యం చేసినావు ఏంది వసంతమ్మా'' అంటూ విసుక్కున్నాడు.

''ఏం చెయ్యను తాతా, ఎంత తొందరగా బయలు దేరినా బస్సు ఆలస్యంగా వస్తే నేనేం చెయ్యను?'' అంటూ ఆఫీసులో అడుగుపెట్టింది.

ఎదురుగా మేనేజర్, ''ఏం వసంతా రాత్రంతా నిద్ర లేదా?'' అంటూ వెకిలిగా నవ్వుతూ.

''అదేం లేదండీ బస్సు ఆలస్యంగా వచ్చింది.''


''అయినా బస్సులో వచ్చే ఖర్మ నీకేంటి, మీ ఆయన రైల్వేలో పని చేస్తాడు, హాయిగా ఆటోలో రావచ్చు గదా మహారాణిలా!''

'మహారాణినో, పనిమనిషినో నీకెందుకు?' అని మనసులో అనుకుంటూ, ''రిజిష్టర్ ఇవ్వండి సార్, సంతకం చేస్తాను'' అంది వసంత.

రిజిష్టర్ ముందుకి తోసి, సంతకం పెడుతున్న వసంత చెయ్యి పట్టుకున్నాడు. ''నువ్వు చాలా అందంగా ఉంటావు, 'నా పట్ల 'పెద్దమనసు' చేసుకున్నావనుకో. ఇంక నీకు ఇలా బస్సులు పట్టుకుని తిరగవలసిన పని ఉండదు, ఎంత లేటుగా వచ్చినా ఎవ్వరూ ఏమీ అనరు. ఏమంటావ్?'' అంటూ అందరి ముందూ శివానందం తన కోరిక తెలియబరచాడు.

చెయ్యి విదిలించుకుంటూ, ''మేము పేదవాళ్లం, మాకెందుకండి లేనిపోని డాబులు దర్పాలు, ఏదో ఇలా నాలుగురాళ్లు సంపాదించుకుంటే చాలు. మీ లాంటివాళ్లతో మంచిగా ఉంటేనే కదా మాకు మంచి రోజులు'' అని నెమ్మదిగా తన సీటులోకి వచ్చి కూర్చుంది.

అప్పుడే ఆఫీసులోకి వచ్చిన అందరూ చూశారు, విన్నారు, ఎవరూ తల ఎత్తలేదు.



ఎందుకలా ఆ అమ్మాయి వెంటపడుతున్నావని ఒక్కరూ అడగలేదు. ఎవరి పనుల్లో వారు మునిగిపోయినట్లు నటించసాగారు.

వసంత తన టేబుల్ ముందుకి వచ్చి కూర్చుంది, తాను ప్యాకింగ్ చెయ్యవలసిన మందులు, అట్టడబ్బాలు తీసి అందులో పెడుతోంది. మనసు మనసులో లేదు. అలవాటుగా పని చేసుకుపోతున్నా, వాడు అందరి ముందూ నాతో ఉంటావా అని అర్థం వచ్చేలా మాట్లాడడం చాలా బాధని కలిగించింది. ఎంత ఆపుకుందామన్నా కన్నీళ్లు ఆగటం లేదు. కోపంతో మనసు రగులుకుపోయింది. వీడికి బుద్ధి చెప్పేవాళ్లే లేకుండా పోయారా అనుకుంది.

''వసంతా, బాధపడకు. ఇక్కడ ఇలాంటివన్నీ మామూలే'' అంటూ ఓదార్చింది రమణి.

''అది కాదు, ఎంత మాట అన్నాడో చూశావా, అందరి ముందూ...'' ఏడుస్తూ అంది వసంత.

''విన్నాను. కానీ వీడిని ఏమీ చెయ్యలేము, మన ఎమ్.డి. పెత్తనమంతా వీడిచేతికే ఇచ్చారు.''

''నేను నేరుగా ఎమ్.డి. దగ్గరకి వెళ్లి చెబుతాను.''

''ఆ అది కూడా అయ్యింది, కావ్యని ఇలాగే ఏడిపిస్తే వెళ్లి చెప్పింది, వీడంటే ఎందుకంత నమ్మకమో తెలియదు, కావ్యని తిట్టి పంపించాడు ఎమ్.డి.''

''అవునా?'' అంది ఆశ్చర్యపోతూ వసంత.

''మేము పదేళ్ల నుంచి ఇక్కడే చేస్తున్నాము, వీడి గోల తప్పించి మరేవిధమైన కష్టముండదు. జీతం నెల అయ్యేసరికి కచ్చితంగా ఇచ్చేస్తారు. వదిలెయ్యి కొందరంతే కుక్క బుద్ధిగాళ్లు ఉంటారు.ట'

అయినా సరే, మనసుని సరిపెట్టుకోలేకపోయింది, తనకి జరిగిన అవమానాన్ని తట్టుకోలేకపోయింది. కన్నీళ్లు టపటపా రాలిపడ్డాయి, ఎలాగైనా సరే, సమయం చూసి వీడికి బుద్ధి చెప్పాలి అనుకుంది వసంత. ఆ రోజంతా పరధ్యానంగా పని చేసింది.

భర్త సరిగ్గా ఉండి ఉంటే, వాడు అన్నట్లుగానే గవర్నమెంటు ఉద్యోగం చేస్తున్నాడు కాబట్టి హాయిగా ఇంటి పట్టునే ఉండొచ్చు, ఏం లాభం, ఎంత గవర్నమెంటు ఉద్యోగం అయినా, విపరీతంగా సెలవులు పెట్టడం వలన, జీతం ఏ నాడూ పూర్తిగా ఇంటికి రాదు. వచ్చిన ఆ కాస్తా తీసుకొచ్చి తల్లి చేతుల్లో పోస్తాడు. పూజలు, నోములు అంటూ ఆవిడ ఖర్చు చేస్తుంది.

తన జీతం డబ్బుతోనే ఇల్లు గడవాలి. ఇవన్నీ అందరికీ చెప్పగలమా?! అసలు కట్నం డబ్బు అనుకున్న దానికన్నా తగ్గించి చేసుకున్నారంటూ, ఉదారస్వభావంతో కాదు. పిల్ల చాలా బాగుందన్న మిష పెట్టి కట్నం తగ్గించారు.

ఇక్కడికి వచ్చాక తెలిసింది, ఎట్టి పరిస్థితులలో కూడా ఉద్యోగం మానకూడదని, ఉద్యోగం మానేస్తే శాశ్వతంగా పుట్టింటికి వెళ్లవలసి వస్తుందనీ బెదిరించారు.

మధ్యాహ్నం అన్నం కూడా తిన బుద్ధి కాలేదు. ఏదో కొద్దిగా తిని టిఫిన్ డబ్బాని సంచిలో వేసింది. టిఫిన్ డబ్బా కోసం వేరే సంచీ తీసుకొస్తుంది, హ్యాండ్ బ్యాగ్ కాకుండా. ఆ సంచీలో డబ్బా వేసుకుంటుండగా సంచీ అడుగుకి వెళ్లిన డబ్బా విసురుగా వచ్చి మోచెయ్యికి తగిలి ప్రాణం గిలగిలలాడింది. 'అబ్బా' మోచెయ్యి రుద్దుకుంటూ అనుకుంది.

# తూచే తూనికరాళ్లు తక్కువ!


కవిత్వ స్పర్శ ఎలా ఉంటుంది? కవిత్వం భావాత్మకమూ, అభౌతికమూ కాబట్టి దాని 'స్పర్శ' అనుభూత్యాత్మకమూ, అనుభవైక వేద్యమే. కవిత్వాన్నివరికి వారు చదువుకొని పలవరించవలసిందే.

అయితే గుండెని కదిలించే పాటలనూ కవితలనూ చదివి, లేదా కవుల ముఖతః విని పరవశించి, వాటిని పదుగురికీ పరిచయం చేస్తారు జింబో (మంగారి రాజేందర్). కవిత్వం అన్నది 'గుండెతడి' కాబట్టి జింబో తన కవితా పరిచయ వ్యాసాల సంకలనానికి ఆ పేరే పెట్టుకున్నారు. అరుణ్‌సాగర్‌తో మొదలుపెట్టి నిఖిలేశ్వర్ వరకూ ఆయన పలువురి కవితా విశేషాలను ఇందులో వివరిస్తారు. కవుల, కవితల నేపథ్యాన్ని సైతం వివరించడం ఈ వ్యాసాల ప్రత్యేకత. 'అంజయ్య గొంతు ఆయుధం' అన్న ఓ వ్యాసం దీనికి చక్కని ఉదాహరణ. ''ఊరిడిసి నే పోదునా... అయ్యో' అంటూ అంజయ్య ఒక పాట రాసిన సంగతి తెలిసిందే. అయితే ఆ పాట ఎలా పుట్టిందీ 'జింబో' చెబుతారు. అంజయ్యకి ఒకనాడు కాళ్లకు చెప్పులూ పెయ్యిమీద అంగీకూడా లేని ఒక తాత తారసపడ్డాడట. తన బిడ్డ పెండ్లికి మున్నూరు రూపాయలు అప్పుజేసి, ఆరేళ్లు పనిచేసినా ఇంకా బాకీ తీరని సంగతి ఆ తాత అంజయ్యకు చెప్పాడు. ఆ తాత మాటల్లోని ఆర్తే అంజయ్య పాటయింది. అంజయ్యతో స్వయంగా మాట్లాడి జింబో ఈ సంగతులు మనకు చెబుతారు. ఇలా కవిత్వాన్ని మాత్రమే కాకుండా, దాని వెనుకవుండే నేపథ్యాన్ని కూడా చెప్పడం ఎంతో బాగుంది. వానకల, ఒకేమాట —ఒకేపాట, కన్నీటి చుక్క కవిత్వం, ఆత్మకథనాత్మక వేదన, సూఫీవర్షంలో 'దీవి', నిద్రలేచిన కవి గుడిహాళం, మమతల మహాకావ్యం 'ఇల్లు', కవిత్వం కనికట్టు —'బల్లకట్టు', విషాద 'కచ్చురం', వాహ్.. న ఖాబ్, అధిక్షేపకవి ఎస్వీ; వంటి వ్యాసాలు 'గుండెతడి'లో కనిపిస్తాయి.

జింబో స్వయంగా కవికావడంతో ఆయన 'కవి పక్షపాతం' ఇందులో అగుపిస్తుంది. ఆయన 'మెచ్చుకోలు'లో ఔదార్యం పాలెక్కువ. తన దృష్టికి వచ్చిన కవిత్వంలో ఎక్కడ ఏ కొంచెం మెరుపు కనిపించినా ఆయన ప్రశంసించకుండా వుండలేరు! దీంతో ఆయన 'గుండెతడి' వ్యాసాలలో ఒక పార్శ్వమే కనిపిస్తుంది. నిజానికి తూనికరాళ్లు తక్కువ వేసి ఎక్కువ సరుకును తూచి యివ్వడం 'విమర్శ' లక్షణం కాదు. కేవలం మెచ్చుకోళ్లకే పరిమితం అయినందువల్ల 'గుండె తడి' వ్యాసాలు పరిచయ వ్యాసాలు మాత్రమే అవుతాయి తప్ప విమర్శావ్యాసాలు కాబోవు. అట్లాగే పదే పదే కొన్ని వ్యాసాలలో తన (జింబో) కవితలనే ఉటంకించడం ('హింసకు వ్యతిరేకంగా తెలుగు కవిత్వం' 'రక్తదాహం లేని బాటకు నమస్కారం,' 'ప్రమాద రేఖపై నిల్చున్న ప్రవాహిత దుఃఖం,' 'చెలిమెల మంచాన్ని పట్టుకుని వేలాడుతున్న వాగు' వంటి వ్యాసాలు) కూడా బాగోలేదు. 'సాహితీ విమర్శకులు' ఇట్లాంటి బలహీనతలను తగ్గించుకుంటే మంచిది.

—స్వాతి

**గుండె తడి**
**(ఆధునిక కవిత్వ స్పర్శ.)**
**రచన: జింబో,**
**వెల: 100/–,**
**పుటలు: 170,**
**ప్రతులకు:**
**ప్రోజ్ —పోయెట్రీ ఫోరమ్,**
**305, సౌందర్య రెసిడెన్సీ,**
**స్ట్రీట్ నం.8,**
**హిమాయత్‌నగర్,**
**హైదరాబాద్ —500 029.**




ఇవాళ జీతాలు ఇచ్చే రోజు. జీతాలే కాకుండా దీపావళి బోనస్ కూడా ఇస్తున్నారని తెలిసింది. జీతాలు ఇచ్చే రోజు కొద్దిగా ఆలస్యం అవుతుంది రోజూ కన్నా.

సాయంకాలం అయింది. హాలంతా తప్పనిసరిగా సర్దాలి. ప్యాకింగ్ చేసిన డబ్బాలన్నీ ఓ పక్కగా పెట్టాలి. ఇవన్నీ అయ్యేసరికి 7 సంవత్సరాలు అవుతుంది. బస్సు దొరికి ఇంటికి వెళ్లేసరికి 7.30. ఇదే రోజు దినచర్య, జీతాలు ఇచ్చే రోజు ఇంకొంచెం ఆలస్యమవుతుంది.

బోనస్‌లు తీసుకోవలసిందిగా కబురు వచ్చింది. ఆడవాళ్లంతా కలసి ఒక్కసారే తీసుకుని కొద్దిగా ఆలస్యం అయినా అందరూ ఒకే సారి బస్ స్టాపుకి వస్తారు. ఈ కంపెనీలో పని చేసేవాళ్లంతా స్త్రీలే. వాళ్లు నిజాయితీగా, ఓపిగ్గా చేస్తారని నమ్మకం. ఇరవై మంది దాక పని చేస్తున్నారు. అందరూ స్నేహితుల్లా, అక్కాచెల్లెళ్లలా ఉంటారు.

ఒక్కొక్కరే బోనస్, జీతాలు కలిపి తీసుకుంటున్నారు. కావాలనే వసంత పేరు ఆఖరున పిలిచాడు మేనేజర్, అప్పుడే సరిగ్గా కరెంటు పోయింది. టిఫిన్ డబ్బా ఉన్న సంచీతో బలమంతా ఉపయోగించి ముఖం మీద కొట్టింది వసంత.

"అబ్బా!" అంటూ హృదయవిదారకమైన కేక వినిపించింది.

"ఏమైంది ఏమైంది?" అంటూ అందరూ గుంపుగా ముందుకి వచ్చారు.

మరుక్షణమే, కరెంటు వచ్చి లైట్లు వెలిగాయి.

దవడ కదిలి, నోట్లో నుంచి రక్తం కారుతూ, బాధతో మెలికలు తిరుగుతున్న శివానందాన్ని ఆశ్చర్యంగా చూశారందరూ.

చీకట్లో ఇంత దెబ్బ ఎవరు కొట్టారో తెలియదు.

వసంతా? అన్న అనుమానం వచ్చింది.

ఎవరిని అడిగినా లాభంలేదు. అందరిదీ ఒకే కట్టు. తన మీద అందరికీ కోపం ఉందని తెలుసు, కావ్య విషయంలో జరిగినదాన్ని ఎవరూ మరచిపోలేదు.

రక్తం కారుతుంటే అందరూ "అయ్యో!"అంటూ బాధపడ్డారు. వాచ్‌మాన్‌ని పిలిచారు.

వాడు ఆటో తీసుకురావడం కోసం పరుగు పెట్టాడు. తిరిగి వచ్చి "ఆటో తెచ్చానండి సార్, హాస్పిటల్‌కి పోదాం. పళ్లు బాగా కదిలినట్లున్నాయి" అంటూ శివానందాన్ని చెయ్యి పట్టుకుని నడిపించుకుని తీసుకెళ్లాడు.

మరోసారి అనుమానంగా వసంత వైపు చూశాడు. అమాయకమైన ఆమె కళ్లలో నీరు కనిపించింది. "వసంత కాదు, ఎవరైనా సరే, మళ్లీ వచ్చాక పని పట్టాలి" అనుకుంటూ ఆటోలో కూర్చున్నాడు శివానందం.